

కూల్చివేతలో హైడ్రామా

మున్సిపల్ సిబ్బంది చేపట్టిన కూల్చివేతలో హైడ్రామా చోటుచేసుకుంది. ఈ ఘటన ఇబ్రహీంపట్నంలో జరిగింది. 8లో ▸



రెక్కీ చేసి.. చోరీకి పాల్పడి

రాత్రివేళ గోదాం షటర్, తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దొంగల ముఠా పోలీసులకు చిక్కింది. 8లో ▸



న్యాయం చేయాలి

దివ్యాంగుల భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

'ఫ్యూచర్' రహదారిపై రైతులతో సమావేశం




కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న మండల పరిధిలోని తిమ్మాపూర్ రైతులతో శనివారం రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు, తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో రైతులతో పరిహారం విషయమై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ కోసం వంద మీటర్ల రహదారి నిర్మాణానికి తమ భూములు ఇవ్వాలని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఉంటుందని తెలిపారు. తమ భూములకు బహిరంగ మార్కెట్‌లో రూ.4 కోట్లు ధర పలుకుతోందని, ఆ ప్రకారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వారికి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిబిరాల పోస్టర్ల ఆవిష్కరణ



ఆమనగల్లు: వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి ఉచిత శిక్షణ శిబిరాల పోస్టర్లను త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆవిష్కరించారు. ముచ్చింతల క్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వీటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు దార్ల చిత్తరంజన్‌దాస్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జిలు శ్రీరాం, జంగయ్య, రాజేశ్, ఆదిత్య పాల్గొన్నారు.

వీఎం హోంలో షూటింగ్.. నిర్వాహకులపై ఫిర్యాదు



వీఎంహోంలో షూటింగ్ ఏర్పాట్లు

హుడాకాంప్లెక్స్: పాఠశాల పని దినాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇచ్చి విద్యార్థుల హక్కులకు భంగం కలిగించిన వీఎంహోం కార్యదర్శి కె.కిషన్, సూపరింటెండెంట్ ఈ.లక్ష్మీపార్వతి, ప్రిన్సిపాల్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని వీఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బి.మహేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. అక్రమ సంపాదన కోసం విద్యార్థుల చదువులను పణంగా పెట్టడం, బాలల హక్కులకు భంగం కలిగించిన విషయంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్, బాలల హక్కుల కమిషన్‌తో పాటు షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా శనివారం ఫిర్యాదు చేశారు. వీఎంహోంలో సిబ్బంది నియామకం, కొనుగోలు టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సహాయ కార్యదర్శి సాగర్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు భాస్కర్, వినయ్, విఠల్, గణేష్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సింగపూర్ సదస్సుకు మొగిలిగిద్ద వాసికి ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: సింగపూర్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు మండల పరిధిలోని మొగిలిగిద్ద నివాసి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డికి ఆహ్వానం లభించింది. సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఇండియా భాగస్వామ్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో 'అర్బన్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ క్లైమేట్ మిటిగేషన్' అంశంపై రాసిన పరిశోధన పత్రాన్ని డాక్టర్ రవీందర్‌రెడ్డి ప్రజెంట్ చేయనున్నారు. సదస్సుకు ఎంపికైన డాక్టర్ రవీందర్‌రెడ్డిని శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. ప్రొఫెసర్ హరగోపాల్ అభినందించారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకొని నవభారత నిర్మాతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. భారతదేశం ప్రస్తుతం వాతావరణంలో మార్పును ప్రధాన సమస్యగా ఎదుర్కొంటోందని, ఈ సమస్యను అధిగమించి అభివృద్ధి చెందే విధంగా ప్రజెంటేషన్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉందని డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

అక్షరాల ఆస్థానం 150 ఏళ్ల ప్రస్థానం

- ఎంతో మంది మేధావులను అందించిన మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల
- ఈనెల 31న ప్రత్యేక వేడుకలు
- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి



మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల

అక్షర ప్రస్థానంలో అరుదైన జ్ఞాపకాలను నింపుకొంది.. చదువులమ్మ చెట్టు నీడలో ఎంతో మందితో ఓనమాలు దిద్దించింది.. వారి భవితకు బాటలు వేసింది.. సమాజానికి ఎందరో మేధావులను అందించింది.. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా పదిహేను పదుల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది.. 150 వసంతాల వేడుకకు సగర్వంగా ముస్తాబవుతోంది.. అదే షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల.. ఈనెల 31న ఉత్సవాలకు సిద్ధమవుతున్న వేళ ప్రత్యేక కథనం..

– షాద్‌నగర్

సండే స్పెషల్

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మొగిలిగిద్దకు ఎంతో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గంలోనే ఇది అతి పెద్ద గ్రామం. స్వాతంత్ర్యానికి పూర్వమే ఇక్కడ పోలీస్ స్టేషన్, గ్రంథాలయంతో పాటు పాఠశాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను 1873లో నిర్మించారు. నాటి నుంచి ఏటా సుమారు 500 మంది విద్యార్థులకు అక్షరాలు నేర్పుతోంది. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో ఉన్నారు.

గ్రామస్తులను చైతన్యం చేసేందుకు..

రజాకర్లు, నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన తుర్రెబాజ్‌ఖాన్ అప్పట్లో వారి నుంచి తప్పించుకునేందుకు మొగిలిగిద్దలో తలదాచుకున్నట్లు చరిత్ర చెబుతోంది. తుర్రెబాజ్‌ఖాన్‌కు మొగిలిగిద్ద వాసులు ఆశ్రయం ఇచ్చారన్న విషయాన్ని తెలుసుకున్న నిజాం అతడిని హైదరాబాద్ తీసుకెళ్లి ఉరి తీశారని చెబుతారు. అనంతరం గ్రామస్తులను విద్యాపరంగా చైతన్యం చేయాలనే ఉద్దేశంతో 1873లో పాఠశాలను కట్టించారు. మొదట్లో ఉర్దూ మీడియం కొనసాగింది. 1948లో తెలుగు మీడియాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి ముందుకు గ్రామంలో ఉన్న ఠాణా కింద 140 గ్రామాలు ఉండేవి. 1983లో అప్పటి ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌ను కొందుర్గుకు తరలించింది. అనంతరం ఆ భవనంలో పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేశారు.

అక్షరాలు దిద్దిన ప్రముఖులు

బహుబాషా కోవిదుడుగా, రచయితగా, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన బూర్గుల రామకృష్ణారావు, 1970 దశకంలో ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డిలాంటి ప్రముఖులు ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసించడం విశేషం. వీరే కాకుండా గతంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన శ్రీనివాసరావు, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పని చేసిన ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేసిన మల్లారెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త రంగారావు, పౌరహక్కుల సంఘం నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్ సైతం ఈ పాఠశాలలోనే చదివారు.

ఉత్సవాలకు సీఎం రేవంత్ రాక

పాఠశాల స్థాపించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 3న నిర్వహించే ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యవేక్షిస్తున్నారు. గ్రామ శివారులో ఉన్న పాఠశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు

పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర వసతుల కల్పనకు స్టేజ్ కన్సల్టెన్సీలను పిలవనున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఆరోగ్య సబ్ సెంటర్, నీటి వసతి చేపట్టేందుకు, గ్రామంలో సమస్యలు తెలుసుకునేందుకు స్థానిక ఆర్డీఓ ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించేందుకు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. సీఎం చేతుల మీదుగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మండల కేంద్రంపై ఆశలు

చరిత్ర కలిగిన మొగిలిగిద్దను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తున్నారు. గతంలో వంద రోజుల పాటు నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రజాప్రతినిధులను, అధికారులను కలిశారు. గ్రామంలోని పాఠశాలలో నిర్వహించే ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా మండల ఏర్పాటు విషయమై అందరిలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.



ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రంథాలయం

ఉన్నతికి పునాది



ఘనమైన చరిత్ర కలిగిన మొగిలిగిద్దలో చిన్నప్పుడు విద్యను అభ్యసించినందుకు ఎంతో గర్వపడుతున్నాను. విద్యారంగంలో ఉన్నత స్థానంలో నిలబడేందుకు పాఠశాల పునాది వేసింది.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, గ్రామస్తుడు

క్రమశిక్షణకు మారుపేరు



ఇక్కడి పాఠశాల క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచింది. చరిత్ర కలిగిన గ్రామానికి ప్రత్యేకత ఉండాలని మండల కేంద్రం కోసం ఏళ్లుగా ఉద్యమిస్తున్నాం. సీఎం రాక సందర్భంగా ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నాం.

– కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, గ్రామస్తుడు

ఇక్కడే ఓనమాలు దిద్దా



మొగిలిగిద్ద మా స్వగ్రామం. ఇక్కడి బడిలోనే ఓనమాలు దిద్దాను. హైస్కూల్ టెన్త్ మొదటి బ్యాచ్ విద్యార్థిని. ఈ పాఠశాల సమాజానికి ఎంతో మంది మేధావులను అందించింది.

– హరగోపాల్, ప్రొఫెసర్

మాట ఇచ్చి తప్పొద్దు

- భూ రికార్డులను రైతుల పేరిట నమోదు చేయాలి
- ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు



నానక్‌నగర్‌లో సమావేశమైన రైతులు

యాచారం: అధికారంలో ఉన్న పెద్దలు ఇచ్చిన మాట తప్పొద్దు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీకి బలవంత భూసేకరణలో టీజీఐఐసీ పేరు మార్చిన భూ రికార్డులను వెంటనే రైతుల పేరిట నమోదు చేయించాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నానక్‌నగర్‌లో శనివారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతులు సమావేశమయ్యారు. సమావేశానికి పర్యావరణ వేత్తలు, హైకోర్టు లాయర్లు, మానవ హక్కుల వేదిక నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాటిచ్చి అధికారంలోకి రాగానే తప్పుతున్నారని అన్నారు. నాలుగు గ్రామాల్లోని 2,200 ఎకరాల రైతుల పట్టా భూముల రికార్డులను కనీస సమాచార ఇవ్వకుండా అప్పటి అధికారులు టీజీఐఐసీ పేరిట మార్చారని మండిపడ్డారు. మూడేళ్లుగా తమ పట్టా భూముల రికార్డులను టీజీఐఐసీ పేరు తీసేసి తమ పేరిట మార్చాలని రైతులు ఆందోళనలు, ధర్నాలు చేస్తున్న పట్టింపు లేదని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని, ఫార్మాసిటీ రద్దుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాగా, హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా రైతులు సమావేశం కావడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సీఐ కృష్ణంరాజు జోక్యం చేసుకుని సద్దుమణిగేలా చేశారు. కార్యక్రమంలో పర్యావరణవేత్తలు బాబురావు, కవుల సరస్వతి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

తెల్ల కుసుమ సాగుతో అధిక దిగుబడి



డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసి చూపిస్తున్న శాస్త్రవేత్తలు

షాబాద్: తెల్ల కుసుమ సాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే మాథుర్, ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ న్యూఢిల్లీ డాక్టర్ ఎస్‌కే జా పేర్కొన్నారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో శనివారం భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ వారి సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. తిర్మలాపూర్, రేగడిదోస్వాడ గ్రామాల్లో రైతులు సాగు చేసిన కుసుమ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రోన్ ద్వారా మందుల పిచికారీ విధానాన్ని రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు ప్రసాద్, శ్రీనివాస్, సతీష్‌కుమార్, అలివేలు, శారద కుసుమ పంటలో తెగుళ్ల నివారణ, బయోపాలిమర్ టెక్నాలజీ, సస్యరక్షణ పద్ధతులను వివరించారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసి రైతులకు అందిస్తున్న సేవలను ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ వివరించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభల్లో మూడేళ్లలో ప్రజా సమస్యలపై పార్టీ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను బేరీజు వేసుకుంటూ, భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బుగ్గరాములు, చింతపట్ల ఎల్లేష్, ముసలయ్య, చెనమోని శంకర్, విజయ్, ప్రభుదాసు, యాదగిరి, వీరేష్, రాఘవేందర్, రజాక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



రోడ్డు భద్రతపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

కలెక్టర్ నారాయణ రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ కమిషనర్లు, రహదారులు, భవనాల శాఖ అధికారులతో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు–2025, రోడ్ సేఫ్టీ సంబంధిత అంశాలపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత శాఖాధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో మోటారు వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం రెండు వాహనాలు ఉన్నాయన్నారు. రద్దీకి తగ్గట్లు రహదారులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అతి వేగంతో వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా నడిపించడం, ర్యాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా పాటించకపోవడం వంటివి రహదారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు గురైన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదంతో అవగాహన ర్యాలీలు తీయాలన్నారు. ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని, ప్రమాదానికి కారణమైన వివరాలను సేకరించి ప్రత్యామ్నాయ చర్యల కోసం ఉన్నతాధికారులు తెలిపే విధంగా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణా రెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, ఆర్టీసీ, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు

మాజీ మంత్రి మహమూద్ అలీ

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ నేతలు చర్చకు రావాలని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ సవాల్ విసిరారు. జేపీదర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆయన శనివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దర్గా అభివృద్ధి కోసం అప్పట్లో సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. మాస్టర్‌ప్లాన్ అమలుతో స్థానికులు, వ్యాపారులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలనే ఆలోచనతో పనులు చేపట్టడానికి కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ విషయాలు తెలియని కాంగ్రెస్ నేతలు దర్గా అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించడం సరికాదన్నారు. 60 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఎందుకు అభివృద్ధి పనులు చేపట్టడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో దర్గా అభివృద్ధి కోసం కేటాయించిన రూ.50 కోట్ల నిధులు ఇప్పటికీ మైనార్టీ కార్పొరేషన్‌లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులపై కాంగ్రెస్ పార్టీ కుట్ర పూరితంగా పెడుతున్న కేసుల నుంచి వారికి న్యాయం జరగాలని ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ నస్రుల్లాఖాన్, రాంబాల్‌నాయక్, మిట్టునాయక్, సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్, యాదగిరి, కె.శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌నాయక్, అజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములకే రైతుభరోసా



సాగుకు యోగ్యంలేని భూములను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

ఆమనగల్లు: సాగుకు యోగ్యమయ్యే భూములన్నింటికీ రైతుభరోసా అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలులో భాగంగా చేపట్టిన సాగుకు యోగ్యంలేని భూముల గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణపై రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నర్సింహారావు మాట్లాడుతూ.. సాగుకు యోగ్యమైన భూములకు రైతుభరోసా అందిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అర్హులందరికీ రైతుభరోసా అందించడానికి సర్వే చేపట్టిందని చెప్పారు. ఈ నెల 20 నుంచి నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో సాగుకు యోగ్యంలేని భూముల వివరాలు ప్రదర్శించాలని, అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏడీఏ ఆదిలక్ష్మి, ఆమనగల్లు తహసీల్దార్ లలిత, కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్, ఆమనగల్లు, కడ్తాల్ వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీలత, ఆర్‌ఐ చెన్నకేశవులు, ఏఈఓ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

బెదిరించిన వారిపై చర్యలు తీసుకోండి


పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను చంపుతామని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేపట్టారన్నారు. ఆయన్ని చంపుతామంటూ ప్రకటనలు చేస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్, శ్రావణ్‌కుమార్, నాగభూషణ్, అంజయ్య, శేఖర్, దర్శన్ పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యం

- కావలి రవికుమార్ అలియాస్ బిత్తిరి సత్తి

కొందుర్గు: ముదిరాజులు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని కావలి రవికుమార్ అలియాస్ బిత్తిరి సత్తి అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పండుగ సాయన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బిత్తిరి సత్తి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజులు ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో పండుగ సాయన్న పేరుతో ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించి ముదిరాజుల ఐక్యతను చాటాలని సూచించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కావలి రవికుమార్, ప్రవీణ్, శ్రీను, యాదగిరి, తేజ, మహేశ్, శివాజీ, గ్రామ పెద్దలు కావలి యాదయ్య, గోపాల్, వెంకటేశ్, మధు, అందెపై లయ్య, అశోక్, శ్రీధర్‌వర్మ, మల్లేశ్ పూజారి, దశరథం, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటయ్య, శ్రీశైలం, యాదగిరి, రఘు, వేణుగోపాల్, చంద్రశేఖర్, రాజేశ్‌పటేల్, శంకర్, రాములుగౌడ్, కృష్ణ, పెంటయ్య, మాణయ్య, షబ్బీర్, నరేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న బిత్తిరి సత్తి

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటుగా మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్‌ఐ విజయ్ అన్నారు. జిల్లేడ్‌చౌదరిగూడ మండలం చింతకుంట తండాలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. శనివారం క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఐ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరినాయక్, తాండావాసులు గోవింద్ నాయక్, చందర్‌నాయక్, లాలూ, రంచరణ్, వినోద్‌కుమార్, రాహుల్, గబ్రు నాయక్, శ్రీకాంత్, నిలేశ్, మాణ్య, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కందుకూరు: మండల పరిధిలో సరస్వతిగూడ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. దాడుల్లో 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,17,760 నగదుతో పాటు 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తల్లీకూతురి అదృశ్యం

పహాడీషరీఫ్: కూతురితో కలిసి ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ప్రీతి(19), సంతోష్ దంపతులు తుక్కుగూడ మంఖాల్‌కు వలస వచ్చి ప్లాస్టిక్ కంపెనీలో పని చేస్తున్నారు. వీరికి తొమ్మిది నెలల పాప సంతానం. ఈ నెల 13వ తేదీన తుక్కుగూడలోని మార్కెట్‌కు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లి ప్రీతి, కూతురు కనిపించకుండా పోయారు. వారి ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. ప్రీతి తల్లి నవరత్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


కందుకూరు: నుజ్జునుజ్జయిన కారు

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మండలం చంద్రాయన పల్లికి చెందిన కసిరెడ్డి విశాంత్‌రెడ్డి(30) శనివారం ఉదయం హైదరాబాద్‌కు ఆల్టో కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో శ్రీశైలం రహదారిపై మండల పరిధిలోని గూడూరు గేట్ సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న ఐ-20 కారు ఢీకొట్టింది. ఈ క్రమంలోనే మరో ఇన్నోవా కారును సైతం ఢీకొట్టింది. దీంతో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. ఆల్టోలో ఉన్న విశాంత్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం స్థానికులు అంబులెన్స్‌లో హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా ఐ-20 కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అతని పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టీ తాగడానికి వెళ్లి..

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామం వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన లాలయ్య ఆమనగల్లు పట్టణంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా ఆయన శనివారం ఉదయం విఠాయిపల్లి వద్ద టీ తాగడానికి వెళ్లి రోడ్డు పక్కన నిలబడిన సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న అంబులెన్స్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాలయ్య తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి

- భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి
- వీహెచ్‌పీఎస్ నాయకుల డిమాండ్


కందుకూరులో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

కందుకూరు: దివ్యాంగుల భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, వీహెచ్‌పీఎస్ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్‌రావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. అన్నోజిగూడకు చెందిన నలుగురు మహిళా దివ్యాంగులకు చెందిన 9.16 ఎకరాల భూమిని వారి బావ అయిన గొర్రెంకల యాదయ్య, ఆయన కుటుంబీకులు కబ్జా చేశారని ఆరోపించారు. బాధితులైన దివ్యాంగులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామన్నారు. బాధితుల పక్షాన దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం పీఎస్‌లో కేసు నమోదు చేయించామన్నారు. మహిళలను మానసిక క్షోభకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలుమాదిగ, నాయకులు జంగయ్య, సలీం, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెక్కీ చేసి.. చోరీకి పాల్పడి

- దొంగతనం కేసులో నలుగురి అరెస్టు
- నగదు, వాహనాలు స్వాధీనం


పోలీసులకు పట్టుబడిన నిందితులు

మొయినాబాద్: రాత్రివేళలో గోదాం షటర్, తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దొంగల ముఠాను మొయినాబాద్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రంలోని భరద్వాజ్ కాలనీలో ఉన్న పద్మావతి అసోసియేట్ స్టోరేజ్ గోదాంలో ఈ నెల 15న రాత్రి చోరీ జరిగింది. రూ.6 లక్షల నగదు దొంగిలించడంతో మరుసటిరోజు గోదాం ఇన్‌చార్జి వినీత్‌రెడ్డి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించి ఎట్టకేలకు నలుగురిని పట్టుకున్నారు.

పది రోజుల ముందే పథకం

రాజస్థాన్‌కు చెందిన సైతాన్‌రామ్ మొయినాబాద్‌లో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. తనకు అవసరమైన సరుకులను భరద్వాజ్ కాలనీలో ఉన్న స్టోరేజ్ గోదాం నుంచి తెచ్చుకునేవాడు. ఈ క్రమంలో గోదాంలో డబ్బులు ఎక్కడ పెడుతారనే విషయాలను గమనించాడు. పక్కన మెకానిక్ షాప్‌లో పనిచేసే పరమేశ్వర్‌తో కలిసి గోదాంలో దొంగతనం చేయాలని పది రోజుల ముందే పథకం పన్నారు. తమ ముఖాలను గుర్తిస్తారని భావించి దొంగతనం కోసం రాజస్థాన్‌కు చెందిన మరో ఇద్దరిని సిద్ధం చేశారు. కొంపల్లిలో ఉండే హులాస్, మొయినాబాద్‌లోని ఆయాన్ కళాశాల పక్కన ఉన్న ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే భవాని సింగ్‌ను పిలిపించారు. 15న అర్ధరాత్రి హులాస్, భవాని సింగ్‌లు టోపీలు, శాలువాలు ధరించి గడ్డపార, స్క్రూడ్రైవర్ సహాయంతో గోదాం షటర్ ఎత్తి, బీరువాను విరగొట్టి అందులో ఉన్న రూ.6 లక్షల నగదు దోచుకెళ్లారు. సైతాన్ రామ్, రామేశ్వర్‌లు ఫాంహౌస్ వద్ద బొలేరో వాహనంలో వేచి ఉన్నారు. దొంగతనం చేసిన డబ్బులు తీసుకురాగానే నలుగురు వాటాలు పంచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీసీ కెమెరాల ఆధారంగా రెండు బృందాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బొలేరో, యాక్టీవా, 4 సెల్ ఫోన్లు, రూ.2.96లక్షల నగదు, దొంగతనానికి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ట్రాన్స్‌జెండర్ల వికృత చేష్టలు

అరెస్టు చేసిన పోలీసులు

మీర్‌పేట: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై రాత్రి వేళల్లో ట్రాన్స్‌జెండర్లు అసభ్యకర దుస్తులు ధరించడంతో పాటు వికృత చేష్టలు చేస్తూ రోడ్లపై వెళ్లే వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు శుక్రవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మందమల్లమ్మ చౌరస్తా, టీకేఆర్ కమాన్, గాయత్రినగర్ కూడళ్ల వద్ద 16 మంది ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఇకపై స్టేషన్ పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గడువు ముగిసిన శీతల పానీయాల విక్రయం

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడువు తీరిన శీతల పానీయాలు, సోడాను విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన పరేష్ సీత్(46), మహదేవ్ పటేల్‌తో కలిసి గత కొన్నాళ్లుగా జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని తుల్జా భవానీ వైన్స్ పక్కన కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందులో గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్, సోడాను విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి, పానీయాలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు.

షెడ్డు కూల్చివేతలో హైడ్రామా

తమ నిర్మాణాన్ని కూల్చేయొద్దంటూ పెట్రోల్ పోసుకొని హల్‌చల్

ఇబ్రహీంపట్నం: అక్రమ నిర్మాణమని ఓ షెడ్డును కూల్చివేసేందుకు వచ్చిన మున్సిపల్ సిబ్బందిని సదరు యజమాని అడ్డుకొని ఒంటిపై పెట్రోల్ పోసుకొని హల్‌చల్ చేసిన ఘటన ఇబ్రహీంపట్నంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా పక్కన మంచాల రోడ్డుకు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ డి.రవి సోదరుడు సత్యనారాయణకు చెందిన స్థలంలో ఇటీవల రేకుల షెడ్ వేసి షెటర్లను నిర్మించారు. దీనికి అనుమతి లేదని ఇబ్రహీంపట్నం మున్సిపల్ సిబ్బంది జేసీబీతో కూల్చివేసేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రవి, సత్యనారాయణలు ఘటనాస్థలికి వచ్చి మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తన వద్ద అన్ని పత్రాలు, కోర్టు ఆర్డర్లు ఉన్నాయని రవి మున్సిపల్ సిబ్బందికి చెప్పే ప్రయత్నంలో ఆవేశానికి లోనయ్యారు. దీంతో రవి, అతని సోదరుడు సత్యనారాయణ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మున్సిపల్ సిబ్బంది వెనుదిరిగారు.

అనుమతి లేదు: రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

సత్యనారాయణ నిర్మించిన షెడ్‌తో కూడిన షెటర్లకు మున్సిపల్ అనుమతిలేదు. రాత్రిళ్లు నిర్మాణం చేపట్టారు. రోడ్లకి జరిగి నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. నిర్మాణదారులకు నోటీసులు కూడా ఇచ్చాం. కూల్చివేసేందుకు తమ సిబ్బంది వెళ్లడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డారు.



కూల్చివేసేందుకు జేసీబీతో వచ్చిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ సిబ్బంది


పెట్రోల్ పోసుకుంటున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, పక్కన సత్యనారాయణ